క్లుప్తంగా

మేయర్‌కు బాచుపల్లి సీఐ ఆహ్వానం



నిజాంపేట్: బాచుపల్లి సీఐ నరసింహారెడ్డి గురువారం మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోం మంత్రి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ సీఐ ఆహ్వాన పత్రికను మేయర్‌కు అందజేశారు.

'అనాథలకు నా వంతు సాయం చేస్తా'

జీడిమెట్ల: అమ్మ, నాన్న లేని చిన్నారులకు మేమున్నాం అనే భరోసాను ఇవ్వాలని సుభాష్ నగర్ కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత కుమార్తె రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం రాజ్యలక్ష్మి తన పుట్టినరోజును పురస్కరించుకుని సుభాష్‌నగర్‌లోని అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలతో కేక్ పంచుకున్న ఆమె వారికి ప్రత్యేక వంటకాలను చేయించి వడ్డించి వారితో కలిసి భోజనం చేసింది. ఈ పుట్టినరోజు పిల్లలతో గడపడం తనకు చాలా ప్రత్యేకమైన పుట్టినరోజు అని తెలిపింది. ముమ్ముందు పిల్లలకు తనవంతు సహాయం అందించి వారికి భరోసా కల్పిస్తానని ఆమె అన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్ట్ అన్యాయం



రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: తీన్మార్ మల్లన్న అరెస్ట్ అన్యాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత పాత్రపై మల్లన్న గత కొన్ని రోజులుగా చేస్తున్న విమర్శలను తట్టుకోలేక అరెస్ట్ చేసి జైలుకు పంపడం పద్ధతి కాదన్నారు. జర్నలిస్టులు కూడా తెలంగాణలో స్వేచ్ఛగా పని చేయలేని పరిస్థితి వచ్చిందని జర్నలిస్టులంతా ఆలోచించాలని సూచించారు.

జీవకోటికి నీరే ప్రాణాధారం

హఫీజ్‌పేట్ : సమస్త జీవకోటికి గాలి తర్వాత నీరే ప్రాణాధారమని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి కార్యాలయంలో జల దినోత్సవ అవగాహన పత్రాన్ని అసోసియేషన్ సభ్యులతో కలిసి జనరల్ మేనేజర్ రాజశేఖర్ ఆవిష్కరించి మాట్లాడారు. నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుందని అలాగే అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధాన ఆధారమన్నారు. శరవేగంగా పెరుగుతున్న జనాభాకు అంతే వేగంగా నీటి అవసరం కూడా పెరుగుతుందన్నారు. భూమిపై ఉన్న నీటి వనరులలో 97 శాతం సముద్ర జలాలే అన్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందక ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అనేక రోగాల బారినపడి ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం, వృథాని అరికట్టడం, వర్షపు నీటిని సముద్రం పాలు కానివ్వకుండా చెక్ డ్యాం, ఇంకుడు గుంతలు, ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాల నీటిమట్టం పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి.రావు, పాలం శ్రీను, జనార్దన్, మల్లారెడ్డి, అమ్మయ్య చౌదరి, అశోక్ పాల్గొన్నారు.

మనూ 'సోఫ్రే హాఫ్టసిన్ పట్టిక ఏర్పాటు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సంప్రదాయబద్ధంగా 'సోఫ్రే హాఫ్టసిన్' పట్టికను ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ సందర్భంగా ఏడు అంశాల అమరికతో పర్షియన్ సబ్జిహా(గోదుమగడ్డి), సమాను (తీపిపుడ్డింగ్), సెర్కే(వెనిగర్) మొదలైన వాటితో ఇతర తీపి పదార్థాలు, పండ్లను ఒక టేబుల్ ఏర్పాటు చేసి దానిపై అమర్చడం విశేషం. ఈ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఆయన సతీమణి అర్షియా హసన్ తిలకించి ప్రారంభించారు.

పేపర్ లీకేజీ నిందితులను శిక్షించాలి

దుండిగల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో నిందితులను గుర్తించి వెంటనే శిక్షించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఆరోపణలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విచారణ నిమిత్తం గురువారం సిట్ కార్యాలయంలోని అధికారుల ఎదుట హాజరయ్యారు. ఆయనకు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు తరలివెళ్లి ఆయనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా ఎంతో మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.లక్ష్మి, బండి శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌రెడ్డి, పరశురాములు ఉన్నారు.

మట్టి తొలగించారు.. స్థానికులు హర్షించారు



అయోధ్యనగర్‌లో రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న పారిశుద్ధ్యం సిబ్బంది

ఇటీవల కురిసిన వర్షాలతో అయోధ్య నగర్ మీదుగా జీడిమెట్ల పారిశ్రామిక వాడ నాలా వరకు వర్షపునీరు పొంగిపొర్లడంతో మట్టి, ఇసుక రోడ్లపైకి చేరింది. ఈ విషయాన్ని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు (జోసఫ్) సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం బస్తీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మట్టిని తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక పారిశుద్ధ్య విధులు నిర్వర్తించే సిబ్బందితో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించి అక్కడ నుంచి తరలించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– కుత్బుల్లాపూర్

మ్యాన్‌హోళ్లపై మూతల ఏర్పాటు



మ్యాన్‌హోళ్లపై మూతలు ఏర్పాటు చేయాలని సాక్షిలో వచ్చిన కథనానికి మున్సిపల్ స్పందించారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని కూన మహాలక్ష్మినగర్‌లో మ్యాన్‌హోళ్లపై ఉన్న మూతలు ధ్వంసమయ్యాయి. కొత్తవి ఏర్పాటు చేయాలని ఈనెల 20న సాక్షిలో వచ్చిన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించారు. మ్యాన్‌హోళ్లపై మూతలు లేని చోట మూతలను ఏర్పాటు చేశారు.

– జగద్గిరిగుట్ట

డ్రైవర్ నిర్లక్ష్యం.. వాహనాలు ధ్వంసం



జగద్గిరిగుట్ట: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం జగద్గిరిగుట్టకు చెందిన యాదయ్య ట్రాక్టర్‌పై మైసమ్మనగర్ నుంచి జగద్గిరిగుట్ట బస్టాప్ వైపు వెళ్తుండగా జన్మభూమి మార్కెట్ దగ్గర రాగానే అక్కడ పార్కింగ్ చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. వాహనాదారులు డ్రైవర్‌ను నిలదీయగా ట్రాక్టర్‌కు బ్రేకులు ఫెయిల్ అయ్యాయని తెలిపాడు. కాగా యాదయ్య మద్యం మత్తులో ఉన్నాడన్న అనుమానంతో స్థానికులు పోలీసులకు ఫోన్ చేసి అతడిని అప్పగించారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగం మరువలేనిది

కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు, మర్రి రాజశేఖర్‌రెడ్డిలను సత్కరిస్తున్న భగత్‌సింగ్‌నగర్ వాసులు



భగత్‌సింగ్, పెంచల్‌రెడ్డిల కాంస్య విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

చింతల్: స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ వారిని గడగడలాడించి... దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు భగత్‌సింగ్ అని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన భగత్‌సింగ్, భగత్‌సింగ్ నగర్ వ్యవస్థాపకుడు పెంచల్‌రెడ్డిల కాంస్య విగ్రహాలను గురువారం ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... నేటి తరానికి భగత్‌సింగ్ స్ఫూర్తి అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగం మరువలేనిదన్నారు. అదే విధంగా భగత్‌సింగ్‌నగర్ బస్తీని స్థాపించిన పెంచల్‌రెడ్డి ఆశయ సాధనకు అందరం కృషి చేయాలన్నారు. పెంచల్ రెడ్డి ఆశించిన విధంగా భగత్‌సింగ్ నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రాబోయే రోజుల్లో పేదలందరికీ పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

◆ అదే విధంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డిలు హాజరై విగ్రహాలకు నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ తంగ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల ఆశయసాధనకు కృషి చేయాలి..

నిజాంపేట్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగం మరువలేనిదని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీరు అన్నారు. గురువారం వారి వర్ధంతిని పురస్కరించుకుని ప్రగతినగర్‌లోని పీకాక్ సెంటర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ.. నేడు దోపిడీదారుల రాజ్యం కొనసాగుతోందన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ప్రాణ త్యాగం చేసింది ఇలాంటి దేశం కోసం కాదన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, మల్లికార్జున్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో...

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పరిధిలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మగ్దూంనగర్‌లోని భగత్‌సింగ్ మార్గ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి..

చింతల్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన చింతల్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ చింతల్, చంద్రానగర్, శివనగర్, సాయినగర్ కాలనీ, రంగనగర్, దుర్గనగర్, శాటిలైట్ అపార్ట్‌మెంట్స్, వైఎంఎస్ కాలనీలలో పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే కార్యక్రమాలు, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కేవలం సీఎం కేసీఆర్ కుటుంబీకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మాత్రమే బాగు పడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, పండరీరావు, నారాయణరెడ్డి, జేమ్స్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బౌరంపేటలో కంటి వెలుగు షురూ



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కంటివెలుగును నిర్వహిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. బౌరంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం ఆయన కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, విష్ణువర్దన్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, గోవిందరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నవీన్‌గుప్తా..



అన్నదాన కార్యక్రమం..

సుభాష్‌నగర్: శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దూలపల్లి మాజీ సింగిల్‌విండో చైర్మన్ పడకంటి నవీన్‌గుప్తా అన్నారు. గురువారం దూలపల్లిలోని అశోక-అలమైసన్‌లో కొత్త సంవత్సరాన్ని పురస్కరించాలని వసంత వారోత్సవాల ప్రత్యేక పూజలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ.. శ్రీరామ నవమి వరకు పదిరోజుల పాటు జరిగే ఈ వారోత్సవాలు షోడసి (లలిత) అమ్మవారికి నిత్యం అర్చన, హోమం, అభిషేకం, ఆరాధన, కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈ పూజల్లో పాల్గొనడం ద్వారా సర్వసౌఖ్య అభివృద్ధి, విద్య, వ్యాపార, కుటుంబ సౌఖ్యం జరుగుతుందన్నారు. పూజల్లో భాగంగా గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

శిక్షణతో పాటు కుట్టు మెషిన్లు ఇవ్వడం హర్షణీయం



మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సురేష్‌రెడ్డి..

జీడిమెట్ల: మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించడంతో పాటు కుట్టు మెషిన్లను అందించడం నిర్మాన్ సంస్థ గొప్పతనమని బీఆర్ఎస్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్ఆర్ నాయక్‌నగర్‌లోని నిర్మాన్ సంస్థ కేంద్రంలో కుట్టు మెషిన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్‌రెడ్డి మాట్లాడుతూ... మహిళాసాధికారత సాధించినపుడు ప్రతి కుటుంబం ప్రగతిపథంలో నడుస్తుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ఆయన కుట్టుమెషిన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాన్ సంస్థ ప్రతినిధులు వనజా, శిరీషా, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, పద్మా, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు అంబులెన్స్ వాహనం కొనుగోలు



భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమకూర్చనున్న అంబులెన్స్ వాహనం

చింతల్: అత్యవసర సేవల కోసం అంబులెన్స్ వాహనాన్ని కొనుగోలు చేశామని భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లాబకాష్ అన్నారు. గురువారం అంబులెన్స్ వాహనానికి సంబంధించిన అడ్వాన్స్‌ను చెల్లించారు. ఈ సందర్భంగా అల్లాబకాష్ మాట్లాడుతూ... ఉచితంగా అంబులెన్స్ సేవలను అందించనున్నామని అన్నారు. బస్తీవాసుల సంక్షేమానికి తమ సంఘం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు నర్సింహ, చంద్రమౌళి, బిస్సల్లి రాజు, జాన్సన్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

'పోషణ్ పక్వాడ్ అభియాన్'



పిల్లలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దుండిగల్: గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించే విధంగా కృషి చేస్తున్నామని.. పోషకాహారాలు తీసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఐసీడీఎస్ దుండిగల్ సూపర్‌వైజర్ స్పందన తెలిపారు. 'పోషణ్ పక్వాడ్ అభియాన్'కార్యక్రమంలో భాగంగా గురువారం గండిమైసమ్మలోని చిల్డ్రన్స్ హోమ్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను తీసుకుంటే కలిగే ప్రయోజనాలు, ఆరోగ్య విషయంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. పిల్లల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఇన్‌చార్జి అమృత, అంగన్‌వాడీ టీచర్లు రాధా, మీనా దేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న చైర్మన్ టి.కోటిరెడ్డి..

జీడిమెట్ల: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలను సాధిస్తారని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటిరెడ్డి అన్నారు. గురువారం అపురూపాకాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ టి.కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను మోటివేషన్ ద్వారా ఉత్తేజపరిచారు. విద్యార్థులు నేను చేయగలను, నేను చదవగలను, నేను సాధించగలను అన్న దృఢసంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉన్న సందేహాలకు ఆయన చక్కగా సమాధానం చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గురువారం ఆయన చింతల్ డివిజన్ పరిధిలోని చంద్రానగర్, ఓల్డ్ చింతల్ కాలనీల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఓల్డ్ చింతల్‌లో శ్మశానవాటిక అభివృద్ధి, పెండింగ్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. చంద్రానగర్‌లో రూ.1.90 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేసిన నేపథ్యంలో స్థానికులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సాగర్ రావు, సీనియర్ నాయకులు మహ్మద్ మక్సూద్ అలీ, దేగ కృష్ణమూర్తి, కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, దూస కంటి రవి, మురళి, వార్డు మెంబర్ మెహెరున్నిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మనోజ్‌కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: స్నేహితుడి ఇంటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పెయింటర్ మనోజ్‌కుమార్ (24), శోభలు భార్యాభర్తలు. ఈనెల 18న పెయింటింగ్ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనోజ్‌కుమార్ రాత్రి 7గంటల సమయంలో దత్తాత్రేయనగర్‌లోని ఉండే తన స్నేహితుడు విశాల్ ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే నిద్రించిన అతను ఉదయం తిరిగి శ్రీనివాస్‌నగర్‌లోని తన ఇంటికి బయలుదేరాడు. అయితే భర్త ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన శోభ అతని మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. స్నేహితుడు ఇంట్లో వాకబు చేయగా ఉదయమే వెళ్లిపోయినట్లు తెలిపాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

20 కుక్కల పట్టివేత



కుక్కలను పడుతున్న సిబ్బంది..

దుండిగల్: వీధి కుక్కల నివారణపై దుండిగల్ మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గురువారం గాగిల్లాపూర్ ఒకటవ వార్డులో బ్లూక్రాస్ సొసైటీ వారి భాగస్వామ్యంతో 20 కుక్కలను పట్టుకుని వారికి అప్పగించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కుక్కలను పట్టుకుని బ్లూక్రాస్ సొసైటీ వారికి అప్పగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ రెడ్డి. జవాన్ సి. ఎల్లయ్య, బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీడ్రాలో ఇంద్రజిత్‌కు కారు



ఇంద్రజిత్‌కు కారును అందజేస్తున్న వాసవీ గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా

నిజాంపేట్: బాచుపల్లిలోని వాసవీ అర్బన్ ఆధ్వర్యంలో డిసెంబరు 22 నుంచి మార్చి 22 వరకు నిర్వహించిన ఫెస్టివల్ ధమాకా మెగా లక్కీ డ్రాను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసవీ గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా హాజరై లక్కీ డ్రాను తీయగా వాసవీ అర్బన్‌లో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన ఇంద్రజిత్ నాయక్ టాటా నెక్సన్ ఈవీ వాహనాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా అభిషేక్ చందా మాట్లాడుతూ.. ఇళ్ల కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా అధునాతన సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. కొనుగోలుదారులకు సకాలంలో ఫ్లాట్లను అందజేస్తూ వారి నమ్మకమే పెట్టుబడిగా ముందుకు సాగుతున్నామన్నారు.

నేడు బాచుపల్లి ఠాణా ప్రారంభోత్సవం

నిజాంపేట్: బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఉదయం 10 గంటలకు హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ముఖ్య అతిథులు హాజరై ప్రారంభిస్తారని మేయర్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.